తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# క్లస్టర్ విధానం అమలకు శ్రీకారం : జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జనవరి 31 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాఠశాలలో పర్యవేక్షణ పెంచేందుకు క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెడుతు న్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పాఠశాలలపై పర్యవేక్షణ విధానంపై జిల్లా కలెక్టర్, డీఈవో కె.వి.ఎన్ కుమార్‌తో కలిసి ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే దిశగా నూతనంగా తీసుకొచ్చిన క్లస్టర్ విధానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి అమలు అయ్యేలా చూడాలని తెలిపారు. జిల్లాలో 130 క్లస్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో 5 నుంచి 10 వరకు పాఠశాలలు ఉంటాయని, ఒక్కో పాఠశాలలో మౌళిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య ఎసెంటర్లును బట్టి ఆ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ మోడల్ స్కూల్‌లో ఐదు మంది ఉపాధ్యాయులు ఉంటారని, 60 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 60 మంది విద్యార్థులు కంటే తక్కువ ఉన్న పాఠశాలలను బేసిక్ ఫౌండేషన్ పాఠశాలలుగా ఉంటాయన్నారు. గ్రామాల్లో బ్రిడ్జిలు, చెరువులు దాటడం ఎక్కువ దూరం ఐదు కి.మీ ప్రయాణం చేసే పాఠశాలలకు వెళ్ళే పిల్లలకు రవాణా చార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో బాలాజీ, డెప్యూటీవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## నేడు ఇంటి వద్దకే...

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

**- 2.66 లక్షల మందికి రూ.113.20 కోట్లు పంపిణీ**
**- కలెక్టర్ సుమిత్‌కుమార్**


సామాజిక పెన్షన్ల పంపిణీపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

చిత్తూరు, జనవరి 31 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల తరహాలోనే ఫిబ్రవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు లబ్ధిదారులకు నెలలో మొదటి రోజైన శనివారం ఉదయం 6 గంటకల్లా అందించడానికి పక్కాగా ఏర్పాట్లు చేపట్టిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం కలెక్టరేట్ నుండి మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇళ్ళ వద్దకు వెళ్ళి సిబ్బంది పంపిణీ చేసేలా క్షేత్ర స్థాయిలో పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2,66,491 మంది పెన్షన్‌దారులకు 113.20 కోట్ల రూపాయల మొత్తంను సామాజిక పెన్షన్లు పంపిణీ చేయను న్నామన్నారు. ఫిబ్రవరి నెల మొదటి రోజైన శనివారం ఒక్కరోజు సాయంత్రంలోపు వంద శాతం సామాజిక పెన్షన్లు పంపిణీ చేయడానికి పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. అలాగే పెన్షన్ పంపిణీ కోసం నిర్దేశించిన సిబ్బంది శనివారం ఉదయం 6 గంటల నుండి లబ్దిదారుల ఇళ్ళకు వెళ్ళి పెన్షన్ పంపిణీ ప్రక్రియను పక్కాగా ప్రారంభించా లన్నారు. పెన్షన్ పంపిణీ లబ్దిదారులకు మొదటి నాలుగు గంటల్లో పెన్షన్ మొత్తం అందించేలా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసుకోవాలని, పెన్షన్ల పంపిణీలో ఎక్కడా ఏ పొరబాటు జరుగకుండా పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత నెలలలో వివిధ కారణాలతో పెన్షన్ తీసుకోని లబ్దిదారులకు ఈ నెల జనవరి నెల పెన్షన్‌తో పాటు ఫిబ్రవరి నెల పెన్షన్ మొత్తంను పంపిణీ చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు పెన్షన్ల పంపిణీని పకడ్బందీగా పర్యవేక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

# పొరబాట్లు జరగనివ్వం!

**-ఆ రోజంతా లక్షలాదిమందికి సంతృప్తికర సేవలు -3నుండి 5వరకు సర్వదర్శన టైమ్‌స్లాట్ రద్దు -టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు**


రథ సప్తమింపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్, ఇ.ఓ, జెఇఓ

తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి: మాఘమాసం సప్తమి ఘడియల్లో రానున్న మంగళవారం రథసప్తమి పర్వదినాన శ్రీవేంకటేశ్వరస్వామి ఒకేరోజు ఏడువాహనాలపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా తరలివచ్చే 3లక్షలమంది వరకు భక్తులకు సేవలందించడంలో, సౌకర్యాలు కల్పించడంలో, భద్రతపరంగా చిన్నపాటి పొరబాట్లుకు తావులేకుండా ఏర్పాట్లుచేశామని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. ఆ రోజంతా లక్షలాదిమంది భక్తులకు సంతృప్తికర సేవలంది ంచేందుకు పాలకమండలి, అధికారులు, ఉద్యోగులు సేవాభావంతో, సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. శుక్రవారం ఉదయం అన్నమయ్యభవనంలో టిటిడి పాలకమండలి చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నర్సిరెడ్డి, పనబాక లక్ష్మి, జ్యోతులనెహ్రూ, ఆనంద్‌సాయి. ఎంఎస్‌రాజు, శాంతారామ్, నరేశ్, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం,సివిఎస్ఓ మణికంఠచందోలు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, సిఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్రతో కలసి గంటన్నరకుగాపై సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ నాయుడు, ఈఓ శ్యామలరావు మీడియాకు పలు అంశాలు తెలిపారు. 4వతేదీ ఉదయం 5.30 గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఉభయ దేవేరులతో కలసి సప్తవాహనాలపై భక్తులకు దర్శనమిస్తార న్నారు. భక్తులు అశేషసంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, షెడ్లు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు రద్దుచేశామన్నారు. 3వతేదీ నుండి 5వరకు టైమ్‌స్లాట్ దర్శన టోకెన్లు నిలుపుదల చేశామన్నారు. భక్తులు సాఫీగా గ్యాలరీల్లోకి చేరుకునేలా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేశారన్నారు. నిరంత రాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు,టీ,కాఫీ పంపిణీ శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులు అందిస్తార న్నారు. గత పొరబాట్లును దృష్టిలో ఉంచుకుని అందరూ కలసి బాధ్యతతో సేవలందిస్తా మన్నారు. భక్తులు కూడా సంయమనంతో స్వామివారి దర్శనంతోబాటు వాహనసేవలు వీక్షించాలని చైర్మన్ కోరారు.

## మాఢవీధుల్లో గ్యాలరీల్లో... అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

**-భక్తులకు సౌకర్యవంతంగా వాహనసేవల వీక్షణ-తనిఖీల్లో పాలకమండలి**



తిరుమల.జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకొండపై మంగళవారం 4వతేదీ మినీ బ్రహ్మోత్సవాన స్వామివారి వాహనసేవల వీక్షణకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేపట్టామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. వాహనసేవల వీక్షణకు ఆలయ మాఢవీధుల్లో 2లక్షలమంది భక్తులు వేచిఉండే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలు,శాఖలు సమన్వయంతో సేవలందించేలా ప్రణాళికలు తీసుకున్నామన్నారు. రథసప్తమి వేడుకల ఏర్పాట్లు, మాఢవీధుల్లో గ్యాలరీలు, భక్తులను అనుమతించడం, నిష్క్రమణ మార్గాలను టిటిడి బోర్డుసభ్యులు భాను ప్రకాశ్‌రెడ్డి, నర్సిరెడ్డి, పనబాకలక్ష్మి, జ్యోతులనెహ్రూ, ఆనంద్‌సాయి. ఎంఎస్‌రాజు, శాంతారామ్, నరేశ్, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ మణికంఠచందోలు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, సిఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్రతో కలసి తనిఖీ చేశారు.

# ద్రవిడ వర్సిటీకి యుజిసి భారీ నిధుల ఆశలు ఆవిరి!

**-తాజాగా నాక్ 'బి' గ్రేడ్ మాత్రమే కేటాయింపు -స్వయంకృతాపరాధమే కారణమా..?**




కుప్పం, జనవరి 31 ప్రభాతవార్త : ద్రవిడ భాషలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఏర్పాటైన, 27 ఏళ్ల చరిత్ర కలిగిన ద్రవిడ విశ్వవిద్యాలయంకు యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ (యుజిసి) మంజూరు చేసే భారీనిధుల ఆశలు మరో ఐదేళ్లు ఆవిరి అయినట్లే. ఇటీవలే ద్రవిడ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ప్రేమండో మాథూర్ నేతృత్వంలో ఏడుమంది సభ్యులు కలిగిన నాక్ బృందం ద్రవిడ వర్సిటీకి నాక్ గ్రేడ్ గుర్తింపు కోసం మూడు రోజుల పాటు వర్సిటీలో పర్యటించిన విషయం విదితమే. ఈ బృందం మూడు రోజుల పర్యటనలో భాగంగా వర్సిటీలో ఉన్న విద్యార్థులు, కోర్సులు, శాఖలు, మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలు, భవనాలు, వర్సిటీ పరిధిలో చేపట్టిన పరిశోధనలు ఇత్యాదిని పరిశీలించి వెళ్లారు. అయితే నాక్ బృందం ద్రవిడ విశ్వవిద్యాలయంకు తాజాగా నాక్ 'బి' గ్రేడ్‌ను మాత్రమే కేటాయించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ గ్రేడ్ ఇదివరకు వర్సిటీకి ఉన్న గ్రేడింగే. వర్సిటీకి 'ఎ' గ్రేడ్ సాధించాలనే దిశగా వర్సిటీ ఉన్నతాధికారులు ఆఘమేఘాలపై చర్యలు చేపట్టినా అవి బూడిదలో పోసిన పన్నీరుగానే మారిందనే చెప్పాలి. ఇదివరకే ఉన్న 'బి' గ్రేడ్‌ను మాత్రమే మరలా కేటాయించడంతో వర్సిటీకి మున్ముందు యుజిసి నుంచి నిధులు అందేది అంతంతమాత్రంగానే చెప్పాలి. ఎ గ్రేడ్ సాధించి ఉంటే వర్సిటీకి ప్రధాన ఆదాయ వనరుగా దూరవిద్యావిధానంను మరలా ప్రారంభించుకునే వెసులుబాటు ఉ ండేది. ప్రస్తుతం ఆ అవకాశం సైతం లేకుండా పోయింది.

**స్వయంకృతాపరాధమే కారణమా :**

ద్రవిడ వర్సిటీకి 'ఎ' గ్రేడ్ గుర్తింపు రాకపోయేందుకు వర్సిటీ అధికారుల స్వయంకృతాపరాధమే కారణంగా భావించాలి. ఐదేళ్లకోసారి నాక్ బృందం వర్సిటీకి పర్యటన నిమిత్తం వస్తుంది. ఐదేళ్ల కాలంలో వర్సిటీలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డి) విభాగం ఏర్పాటుచేసి ఏయే కార్యక్రమాలు చేపట్టారో నాక్ బృందానికి తెలియజేయాల్సి ఉంది. అయితే కేవలం ఏడాది కాలంనుంచి మాత్రమే వర్సిటీలో ఆర్అండ్‌డి విభాగం ఏర్పాటై ఆ కాలానికి సంబంధించిన రికార్డులు చూపడంతో నాక్ బృంద చైర్మన్ ప్రేమండో మాథూర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరో పక్క వర్సిటీలో కొన్నేళ్లుగా కొంతమంది అధికారులు కూడా వేర్వేరు బృందాలుగా విడిపోయి ఆధిపత్య పోరు చెలాయిస్తూ చివరకు వర్సిటీకి ఆర్థిక కష్టాలు మాత్రం తొలగించని స్థితికి చేర్చారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఏది ఏమైనా ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు, యుజిసి నుంచి వచ్చే నిధులతో ద్రవిడ వర్సిటీ ఎలా ఆర్థిక కష్టాలనుంచి గట్టెక్కుతుందో వేచి చూడాలి.

# ఆలయం సమీక్ష...మున్సిపిల్ కార్యాలయంలోనా!

**నేడు శివరాత్రి విస్తృత స్థాయి సమావేశం -ఐదేళ్ళ శివరాత్రిలో మంత్రుల సమీక్షల ఊసేలేదు-ఆలయ ఆవరణలో సమీక్షకు బయపడుతున్న నాయకులు**



శ్రీకాళహస్తి,జనవరి 31 ప్రభాతవార్త :శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏటా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి గత ఐదేళ్ళ పాటు పరిపాలించిన పాలకులు ఒక్క సంవత్సరం అయినా ఆ శాఖ మంత్రుల ఊసే లేదు. ఇక్కడి నాయకుని ఆదేశాలే, శాసనాలుగా అధికారులు వ్యవహరించే వారు. శనివారం సమీక్షకు ఎప్పుడూ లేని విధంగా అధికారికంగా ఇద్దరు మంత్రులు, హోంమంత్రి కూడా వస్తారని భావిస్తున్నారు. విస్తృత స్థాయిలో ఏర్పాటు చేయనున్న సమీక్షకు మంత్రులతో పాటు ప్రిన్సిపల్ కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్, ఎస్సి హర్షవర్ధన్‌రాజులు హాజరు కానున్నా రని సమాచారం. అయితే బహుశా సెంటిమెంట్ ఏమో? సమావేశం ఆలయ ప్రాంగణంలో కాకుండా, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిసింది. మొదట ఆలయానికి సమీపంలోని జ్ఞానప్రసూనాంబ సదన్‌కు ఎదురుగా ఉన్న 'బ్రహ్మగుడి ఆవరణలో' ప్రత్యేక షెడ్డులు వేసి నిర్వహించాలని భావించారు. మరి ఎందుకు ప్రణాళిక మారిందో ఏమో కానీ మున్సిపల్ కార్యాలయంగా చెబుతున్నారు.ఆలయంలో సమావేశం భవనాలు వున్నా, శివరాత్రి సమీక్ష ఆలయం బయట భవనాల్లో ఏందుకు నిర్వహిస్తున్నట్లు అనేది భక్తుల సందేహం. మున్సిపల్ కార్యాలయంలో వున్న వసతులు, ఆలయ భవనాల్లో లేవా. లేదా శ్రీకాళహస్తీశ్వరస్వామి మహిమకు బయపడి, బయట సమావేశం నిర్వహిస్తున్నారా! అనే అర్థంకాని ప్రశ్న.

**మార్పులకు శ్రీకారం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మార్పులకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తాను సమీక్షలు జరపటమే కాకుండా మంత్రులను కూడా ఆహ్వానించడం జరుతుంది. గత ప్రభుత్వం ఐదేళ్ళులో జిల్లాకు చెందిన కీలక నాయకుడే మంత్రిగా ఉన్నా, పట్టు వస్త్రాలు సమర్పణకు తప్ప, ఒక్క సారి కూడా సమీక్షకు ఆహ్వానించలేదు. ఏ ప్రారంభోత్సవానికి అయినా మంత్రుల ఊసే లేదు, కానీ సుధీర్‌రెడ్డి మాత్రం మొదటి శివరాత్రికే మంత్రులను ఆహ్వానించడం గమనార్హం. ఇందులో కీలకంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూశాఖ మంత్రితో పాటు దేవాదాయశాఖ మంత్రి కూడా హాజరౌతున్నట్లు శుక్రవారం సాయంత్రం సమాచారం.

**మంత్రులకు సెంటిమెంటా?**

శ్రీకాళహస్తీశ్వరాలయం స్వయంభువుగా వెలసియున్న శివయ్య భక్తుల కొరికలు తీర్చే మహిమానితుడు. గతంలో ఇక్కడ దర్శనానికి వచ్చిన కొందరు పదవి అలంకరించడం పదవీరిచ్యుతులు కావటం గమనించదగ్గ విషయం. ఇక్కడ పూజలు చేసి పదోన్నతులతో పాటు విజయం సాధించిన వారు లేకపోలేదు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రిగా శివయ్యను దర్శించుకొని వెళ్లి ముఖ్యమంత్రి అయ్యారు. అలాగే ప్రతి ఎన్నికల్లోనూ బొజ్జల కుటుంబం ఆలయంలోని అంజంజి వినాయకుని పూజించి విజయం సాధిస్తున్న సందర్భాలు లేకపోలేదు. ఎందుకో కొందరు మంత్రులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవటానికి భయపడుతుంటారు. అయితే గతంలో ఇక్కడ 'పూర్ణకుంభం' ఏర్పాటు చేసి ఆహ్వానిస్తారు, నిష్కల్మషంగా దానిని తాకిన వారికి పదోన్నతులు విజయం ప్రాప్తించింది. అయితే మనస్సులో ఏదో తలచుకొని భక్తి ప్రదర్శిస్తే వేటు తప్పలేదు, ప్రస్తుతం పూర్ణకుంభం స్వాగతం లేదు.

# ఎడతెగని సస్పెన్స్!

**-ఎల్లుండి ఏం జరుగుతుందో!**
**-డిప్యూటీ మేయర్ పై కూటమినేతలు, వైసిపిలో అంతర్మథనం**

ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి నగరపాలక తొలికౌన్సిల్‌లో ఖాళీ ఏర్పడిన ఒక డిప్యూటీమేయర్ ఎన్నికకోసం పూర్తి మెజార్టీ ఉన్న వైసిపి నేతలు, అధికారంలో ఉన్న కూటమినేతల్లో ఎడతెగని సస్పెన్స్ నెలకొంది. ఫిబ్రవరి 3వతేదీ ఉదయం 11గంటలకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో జరగనున్న నగరపాలక కౌన్సిల్ డిప్యూటీ మేయర్ పరోక్ష ఓటింగ్ ఎన్నికపై ఏం జరుగుతుందనేది అంతుచిక్కని విషయంగా మారింది. 2021లో తిరుపతి మున్సిపాల్టీ నుండి మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన తొలినుండి తిరుపతి నగరపాలక తొలికౌన్సిల్ పె పట్టుకోసం అప్పటి ప్రతిపక్ష టిడిపి నేతలు, అధికార వైసిపి నేతలు వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అప్పట్లోనే వైసిపి నేతలు స్థానికంగా సిట్టింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, అప్పటి జిల్లా మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, తుడ చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనూహ్యంగా తమ ప్రాపకంకోసం టిడిపి అభ్యర్థులను నామినేషన్ కూడా దాఖలు చేయకుండా చేశారు. ఇందుకు కొన్ని సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. దీంతో 50 డివిజన్ల కార్పొరేటర్ల స్థానాలకు కనీసం 20వరకు కూడా అప్పటి ప్రతిపక్ష టిడిపి అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయలేదు. పైగా 20మందికిపైగా కార్పొరేటర్లను వైసిపి అధికారంతో ఏకగ్రీవం చేసుకుంది. మిగిలిన 28వరకు కార్పొరేటర్లకు ఎన్నికలు జరగ్గా ఒకే ఒక డివిజన్‌లో టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ గెలిచారు. 48మంది బలంతో వైసిపి కార్పొరేటర్లు ఏకంగా డాక్టర్ శిరీషను మేయర్‌గా, ముద్రనారాయణను డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు. ఆ తరువాత కరుణాకర్‌రెడ్డి ప్రాబల్యంతో కొంతకాలానికి భూమన అభినయ్‌రెడ్డిని రెండవ డిప్యూటీ మేయర్‌ను చేశారు. వీరంతా కలసి తిరుపతి నగరపాలకసంస్థలో చేసిందే చట్టం చెప్పిందే వేదంగా పాలనసాగించారనేది ఆరోపణలు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి నుండి భూమన అభినయ్‌రెడ్డి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా వైసిపినుండి పోటీ చేయడంతో డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేశారు.. ఈ కుర్చీ ఖాళీఅయ్యింది. గత ఎనిమిదినెలలుగా ఖాళీగానే ఉన్నా మిగిలిన వైసిపి కార్పొరేటర్ల ఎవరూ పెద్దగా ఆసక్తిచూపలేదు. పైగా మరో ఏడాదిమాత్రం పదవీకాలం ఉండటంతో అలానే పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశాలతో ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో రెండవ డిప్యూటీ మేయర్ ఎన్నిక తెరపైకి వచ్చింది. ఇప్పటికే వైసిపిని వీడి 10మందివరకు కార్పొరేటర్లు కూటమి పార్టీ జనసేనవైపు చేరారు. ఇప్పుడు డిప్యూటీ మేయర్ పదవి ఎన్నిక అనివార్యమవడంతో ఈ పదవికోసం ఇటువైపు వచ్చిన వారిలో ఒకరిద్దరు పోటీపడతున్నారు. అయితే కౌన్సిల్‌లో పూర్తిస్థాయిలో వైసిపికి బలం ఉన్నా జనసేనపార్టీ తరపున మరో డిప్యూటీమేయర్‌ను కైవశం చేసుకోవాలనేది మంత్రాంగం నడుస్తోంది. వైసిపి కార్పొరేటర్లు క్యాంపు రాజకీయాల్లో ఉండగా జనసేన పార్టీ నాయకులు మాత్రం ఆ కుర్చీ తమదేనని ఘంటాపథంగా చెబుతుండటం ఎక్కడకు దారితీస్తుందో వేచిచూడాల్సిందే. పైగా శుక్రవారం రాత్రి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఒక డిప్యూటీ మేయర్ ఎన్నిక ముందే తిరుపతికి చేరి ఓ హోటల్‌లో కూటమిపార్టీల నేతలతో సమావేశమవడం, అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేయడం హాట్‌టాఫిక్‌గా మారింది. మరీ కౌన్సిల్‌లో మెజార్టీ ఉన్న వైసిపి కార్పొరేటర్లు 3వతేదీ ఎలా పరోక్ష ఓటు వేస్తారనేది ఆ పార్టీనేతల్లోనూ ఆందోళన కలిగించే విషయంగా మారింది. కూటమినేతలు తమవైపు 20మంది కార్పొరేటర్లు ఉన్నారని సునాయాసంగా డిప్యూటీ మేయర్ కుర్చీ అందుకుంటామని విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు.



# పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలపై విచారణ జరపాలి : బొజ్జల



తొట్టంబేడు, జనవరి 31 ప్రభాతవార్త : గత ప్రభుత్వంలో అటవీశాఖ మంత్రి, ప్రస్తుత ఎంఎల్‌ఏ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు ప్రస్తుత ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిల అక్రమాలపై ప్రత్యేక విచారణ జరపాలని ఎంఎల్‌ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తాము ప్రతిపక్షంలో ఉన్నపుడు నాటి అటవీశాఖ మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడవిలోనే ఏకంగా రోడ్డు వేసి జగన్ ప్యాలెస్ వలె ఓ ఇల్లు కట్టుకోవడంతో పాటు చుట్టు పక్కల మామిడి చెట్లు పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎస్ కెనాల్ పూర్తిచేయాలంటే కేవలం 9ఎకరాలు అటవీశాఖ క్లియరెన్స్ ఇప్పించలేక పోయారన్నారు. వందల ఎకరాలు స్వాహాచేసిన వారిపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని కోరారు. సజ్జల, విజయ సాయిరెడ్డిలు ప్రభుత్వ భూములు దోచుకున్నారన్నారు. ఏపిఐఐసి భూముల్లో కూడా రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఏలు వారి భార్యలపైరుపై కోట్లు విలువైన భూములు దోచుకున్నారన్నారు. ఒకరు 36 ఎకరాలు మరొకరు11 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయి 2024లో ఆన్‌లైన్‌లో ఎందుకు పేర్లు మార్చారో తెలియజేయాలని దీనిపై వీరు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తిరుపతిలోని ఓటేరు చెరువును దండుకోవాలని కొంతమంది టిడిపి బ్యాచ్‌ను పెట్టుకుని వైకాపా నాయకులు ప్రయత్నం చేస్తున్నారన్నారు.ఇది నిజమా కాదా అని ప్రశ్నించారు. ఈ ఆక్రమణలపై వైకాపా ఎంపి, ఎంఎల్‌ఏలు రాజీనామా చేస్తారా అని డిమాండ్ చేశారు.

**పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమణల చిట్టా ఇదే:**

పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమణలకు హద్దు లేదన్నారు. వారి అక్రమణల చిట్టా ఇదే అని సుధీర్‌రెడ్డి ప్రకటించారు.మంగళం పేట రెవెన్యూ గ్రామ పరిధిలో గ్రామానికి దూరంగా అడవిలో 295 సర్వేనెంబర్ 17.69 ఎకరాలు,సర్వే నెంబర్ 296లో 6 ఎకరాలు, స్పష్టమైన రికార్డులున్నా యన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి 2001లో 45.8ఎకరాల భూమి ఉండగాన అధికారంలోకి వచ్చిన తరువాత వారి భూదాహానికి అడ్డుఆపూ లేకుండా పోయిందన్నారు. 75.75 ఎకరాలకు పెరిగిందన్నారు. ఇదే కాకుండా మరో 30 ఎకరాల భూమి అనధికారికంగా ఉందని సుధీర్‌రెడ్డి ఆరోపించారు.మిథున్‌రెడ్డికి 2009లో 10 ఎకరాలు అన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే నేడు 15 ఎకరాలకు పెరిగిందన్నారు.నేడు పెద్దిరెడ్డి కుటుంబానికి 100 ఎకరాల భూమి అధికారికం చేసుకున్నారని సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. వారి భూ ఆక్రమణలకు సంబంధించి త్వరలోనే సమగ్ర విచారణ జరిపి నిగ్గు తేల్చుతామని స్పష్టం చేసారు.

**దావోస్‌కు వెళ్లి పెట్టుబడులు తెస్తే.. విమర్శించడం సిగ్గుచేటు..**

రాష్ట్రంలో పెట్టుబడులకు సిఎంచంద్రబాబునాయుడు, నారాలోకేష్‌లు దావోస్‌కు వెళ్ళి అందరినీ కలసి పెట్టుబడులకోసం, పరిశ్రమల స్థాపన కోసం కలిస్తే వైకాపా నాయకులు దీన్ని కూడా దారిమళ్ళించి వివాదాలు చేయడం సిగ్గుచేటన్నారు. గత ముఖ్య మంత్రి జగన్‌రెడ్డి రూ.11లక్షల కోట్లు అప్పులుచేస్తే తిరిగి అప్పులు చేయడం అందరికీ తెలిసిందే అన్నారు. పాతనాయకులు రోజా, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు దీనిపై సమాధానం చెప్పాలన్నారు.

# ఆధునీకరణను పరిశీలించిన రైల్వే జనరల్ మేనేజర్

**-అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు**

రేణిగుంట జనవరి 31 ప్రభాతవార్త : సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తిరుపతి రైల్వే కళ్యాణ మండప నూతన భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్లో అంబ్రెల్లా స్కీం ద్వారా జరుగుతున్న అనేక అభివృద్ధి పనులను మంజూరు చేయడమే కాక స్టేషన్ ఆధునీకరణను పరిశీలించారు. తిరుచానూరురైల్వే స్టేషన్ ఒకటవ రెండవ నంబర్ల ప్లాట్ ఫామ్‌లను అనుసంధానం చేసే అండర్ పాస్ బ్రిడ్జిని తనిఖీ చేశారు. రేణిగుంట రైల్వే స్టేషన్ నందు వికలాంగులు, వయోవృద్ధుల కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రి సమకూర్చిన వీల్ చైర్లను ప్రారంభించారు. తిరుపతి రైల్వే స్టేషన్లో వివిధశాఖల అధికారులతో రైల్వే స్టేషన్ల ఆధునీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రేణిగుంట రైల్వే స్టేషన్లో రైల్వే కూలి పోర్టర్లు ఉద్యోగ వసతి ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జనరల్ మేనేజర్‌తో పాటు డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, డివిజనల్ రైల్వే సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, సౌత్ సెంటర్ రైల్వే ఉన్నత అధికారులు, డివిజనల్ రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, గుంతకల్ డివిషనల్ మేనేజర్ ప్రత్యేక ఇన్స్పెక్షన్ రైల్లో గుంతకల్లు బయలుదేరి వెళ్లారు. వీరికి స్వాగతం వీడ్కోలు పలికిన వారిలో తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, రేణిగుంట అసిస్టెంట్ రైల్వే సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, రేణిగుంట స్టేషన్ మేనేజర్ శేషగిరినాథ రెడ్డి, తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్, రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సందీప్, వివిధ శాఖల రైల్వే అధికారులు ఉన్నారు.


కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం

## అక్రమ నాటుతుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు

**పలమనేరు, జనవరి 31 ప్రభాతవార్త:** పలమనేరులో అక్రమంగా నాటుతుపాకీ కలిగిన వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలంలోని అటవీ ప్రాంతంలో ఎవరో నాటుతుపాకీలు ఉపయోగిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు అటవీ సమీప గ్రామాలలో సిబ్బంది గాలించగా ముడివారి పల్లెకు చెందిన నగేష్ (33) అనుమానాస్పదంగా అటవీ సమీపంతో తిరుగుతుండడం గుర్తించి అతని అదుపులోకి తీసుకోగా ఆతని వద్ద ఓ నాటుతుపాకీ గుర్తించామని తెలిపారు. దీంతో నగేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న నాటుతుపాకీ స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామని సిఐ నరసింహరాజు తెలిపారు.

## స్టడీమెటీరియల్ పంపిణీ



**తొట్టంబేడు, జనవరి 31 ప్రభాతవార్త :** మండలంలోని గుండేలిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుమిత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు పాఠశాలలో పనిచేస్తున్న సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు బి.చెంచయ్య ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు యుటిఎఫ్‌చే అన్ని సబ్జెక్టులకు రూపొందించిన స్టడీ మెటీరియల్ కొనుగోలు చేసి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎల్.విజయకుమారి, బి.చెంచయ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

## సివిల్‌రైట్స్ దినోత్సవం



**తొట్టంబేడు, జనవరి 31 ప్రభాతవార్త :** మండలంలోని కారాకొల్లు పంచాయతీ దొంగలముదూరు ఎస్‌సి కాలనీలో శుక్రవారం తహశీల్దార్ మధుసూధనరావు, ఎంపిడిఓ సురేంద్రనాథ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ లత మరియు గ్రామ సచివాలయ సిబ్బంది మండల ఆర్ఐ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ నారాయణ స్వామి, ఎస్ఐ ఈశ్వరయ్య, విఆర్ఓ గోపిల ఆధ్వర్యంలో సివిల్‌రైట్స్ డేను గ్రామస్తులతో చర్చించారు. బాల్యవివాహాలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల గురించి వారికి ఎస్ఐ ఈశ్వరయ్య అవగాహన కల్పించడంతో పాటు ఓటర్ల కార్డులు, రేషన్‌కార్డులు గురించి అవగాహన, వెట్టిచాకిరీ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చోరీలకు చెక్‌పెట్టే అలారం లాక్



**తొట్టంబేడు, జనవరి 31 ప్రభాతవార్త :** చోరీలకు చెక్‌పెట్టే అలారం అందుబాటులోకి వచ్చేసిందని బుచ్చినాయుడుకండ్రిగ సిఐ తిమ్మయ్య అన్నారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ సర్కిల్ సిఐ కార్యాలయంలో అలారం క్లాక్ గురించి వివరించారు. ఈసందర్భంగా సిఐ తిమ్మయ్య మాట్లాడుతూ ఈ అలారం లాక్ ఎవరైనా ఇతర ఊర్లకు వెళ్ళినా, బయటి ప్రాంతాలకు వెళ్ళినా అలారంలాక్ వేసుకుంటే మంచిదని ఎవరైనా చోరీలకు వచ్చినపుడు తాళాలు పగులగొట్టేందుకు ప్రయత్నిస్తే వెంటనే సైరన్ వస్తుందని దీంతో చుట్టుపక్కల వారు కూడా వచ్చేస్తారని దీన్ని ప్రతి ఒక్కరు తీసుకోవచ్చని త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. తాళాలుకావాల్సినవారుతొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య, మహిళా పోలీసు శారద, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా విక్రమ్ బాధ్యతలు



**తిరుపతి కలెక్టరేట్, జనవరి 31 ప్రభాతవార్త :** ప్రస్తుతం జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా పనిచేస్తున్న యు.చెన్నయ్యను చిత్తూరు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా డెప్యూటేషన్‌పై నియమించారు. అలాగే వారికి ఎస్సీ కార్పొరేషన్ కార్య నిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ మేరకు వారు తిరుపతి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికార బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాకు నూతన జిల్లా ఎస్సీ, సంక్షేమ, సాధికార అధికారిగా డైరెక్టరేట్ నుంచి వచ్చిన జరుగు. విక్రమ్‌కుమార్‌రెడ్డి నేటి శుక్రవారం బాధ్యతలు స్వీకరిం చారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించి మర్యాద పూర్వకంగా కలిశారు.

## తహశీల్దార్ కుప్పయ్య సేవలు ఎనలేనివి : కలెక్టర్



**తిరుపతి కలెక్టరేట్, జనవరి 31 ప్రభాతవార్త :** రెవెన్యూ శాఖకు తహశీల్దార్ కుప్పయ్య సేవలు ఎనలేనివని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో పలువురు కొనియాడారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుప్పయ్య తహశీల్దార్ పదవీ విరమణ వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు కలెక్టరేట్ సిబ్బంది హాజరై తహశీల్దార్ కుప్పయ్య రెవెన్యూ శాఖకు చేసిన సేవలను కొనియాడి, శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో తిరుపతి రామ్మోహన్, దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, సుధా రాణి, కలెక్టరేట్ ఏఈవో భారతి, కలెక్టరేట్ సిబ్బంది, పలువురుతహశీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నువ్వుల సాగుపై రైతులకు రాస్ కృషి

**కేవీబీ పురం, జనవరి 31 ప్రభాతవార్త:** తక్కువ నీటి శాతంతో సాగై రైతులకు ఎక్కువ లాభాలను ఇవ్వడంలో నువ్వుల పంట ప్రధాన స్థానం అని రాస్ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. ఈ మేరకు జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా మండలంలోని రాయపేడు, వగత్తూరు గ్రామాల్లో పలు రకాల నూనె, గింజలపై రాస్ శాస్త్రవేత్తలు రైతులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. రైతులు ఈ పంటపై మెలుకువలు కలిగిసేద్యం చేసి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సీపీఎం పార్టీ రాష్ట్ర రైతు విభాగ నాయకులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరంతో పాడి రైతులకు ఎంతో మేలు

**కేవీబీ పురం, జనవరి 31 ప్రభాతవార్త:** ఉచిత పశు వైద్య శిబిరంతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు అన్నారు. ఎంఏ రాజుల కండ్రిగ గ్రామంలో పశు వైద్యాధికారి గుణశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులు అన్ని పశువులకు జోరీగుల మందు (బూటాక్స్ స్ప్రే) చేశారు. కార్యక్రమంలో తిరుపతిపార్లమెంట్ రైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుదర్శనాయుడు, పశువైద్య సిబ్బంది గణేష్, సాయిలత, గురుప్రసాద్, మనోజ్, గోపాలమిత్రలుప్రవీణ్, వెంకటేష్, అజయ్, లోకేష్, రైతులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



**కేవీబీ పురం, జనవరి 31 ప్రభాతవార్త:** మండలంలోని 39 గ్రామ పంచాయ తీల్లో నిర్వహించనున్న క్యాన్సర్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 సచివాలయ పరిధిలోని ఉన్న గ్రామాలకు పింక్ బస్సు ద్వారా తిరుపతి సిమ్స్ వైద్య అధికారులు నోటీ, గర్భాశయం, రొమ్ము, క్యాన్సర్లకు స్కానింగ్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం కొండల్లోఆదవరం సచివాలయ పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అంబేడ్కర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



**కేవీబీ పురం, జనవరి 31 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ బవనం వద్ద శుక్రవారం భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునిరత్నం, ఎంపీడీవో రాధారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, రైతు విభాగ అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, కొత్తూరు మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మురగయ్య, సుబ్రహ్మణ్యం, పాల మంగళం రమేష్, ఉపాధ్యక్షుడు రవిచంద్రన్, మురుగన్, మాజీ ఎంపీపీ మణి, రాయపేడు సర్పంచ్ పొన్నూరు బాలాజీ, కర్లపూడి సర్పంచ్ చంద్రబాబు, టీఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ తెరణి కేశవులునాయుడు, జయరాంరెడ్డి, చెంగారెడ్డి, జయరామరెడ్డి, సురుటుపల్లి మాజీ ట్రస్టు బోర్డు మెంబరు బాలిపెద్ది సుబ్బారెడ్డి, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరునియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు, తదితర నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలుకు ఆర్థిక సాయం

**కేవీబీ పురం, జనవరి 31 ప్రభాతవార్త:**
క్యాన్సర్‌తో బాధపడుతూ పత్రికల ద్వారా దాతల సాయం కోరిన రత్నమ్మ అనే మహిళకు సాయం చేసేందుకు దాతలు ముందుకొచ్చారు. రత్నమ్మ వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు వారికి తోచిన సాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆదిమూలం రూ.5 వేలు తక్షణ సాయం అందజేశారు. స్విమ్స్ వైద్యులతో మాట్లాడి రత్నమ్మకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



## నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా అముద

**నగరి, జనవరి 31 ప్రభాతవార్త :** నగరి నియోజకవర్గ వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలిగా అముదను వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ ంరెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. నగరి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నగరి మున్సిపాలిటీ 6వ వార్డు అముద నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి ఆర్కె రోజాకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## సర్వర్ సమస్యలతో రిజిస్ట్రేషన్ బేజారు



**పాకాల, జనవరి 31 ప్రభాతవార్త :** పాకాల మండలంలలో స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు శుక్రవారం పాకాల సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలోని ఆరు మండలాలలోని ప్రజలు నిన్నా, మొన్నా అమావాస్య పాడ్యమి కావడంతో రిజిస్ట్రేషన్ల కొరకు శుక్రవారం మంచి రోజు కావటం, ఫిబ్రవరి 1వ తేది నుంచి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల చార్జీలు పెంచి నందున ఇప్పటికే అగ్రిమెంట్లు పూర్తయి రిజిస్ట్రేషన్లల కొరకు సిద్ధం చేసుకున్న డాక్యుమెంట్లతో ప్రజలు కార్యాలయానికి పోటెత్తడంతో సర్వర్ సమస్యలు తలెత్తాయి. పొద్దున నుంచి పడిగాపులు కాయడం తమ దస్త్రాలు రిజిస్ట్రేషన్ ఎప్పుడికి పూర్తవుతాయో తెలియటం లేదు అని ప్రజలు వాపోతు న్నారు. పాత చార్జీలే మరొక వారం పొడిగించమని ప్రజల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందుతున్నాయి.

## ప్రజా సమస్యల పరిష్కారానికే కార్యాలయం : ఎంఎల్ఏ



**చంద్రగిరి, జనవరి 31 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఎన్టీఆర్ నగర్‌లో ఎంఎల్ఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. తొండవాడ ఎన్టీఆర్‌నగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎంఎల్ఏ శుక్రవారం ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకై ఎంఎల్ఏ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎంఎల్ఏ కార్యాలయంలో ఇద్దరు యువకులు అందుబాటులో వుంటారని అన్నారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ దుకాణ సముదాయ వేలం వాయిదా

**చంద్రగిరి, జనవరి 31 ప్రభాతవార్త:** చంద్రగిరి గ్రామ పంచాయతీ దుకాణ సముదాయానికి నిర్వహించతలపెట్టిన బహిరంగ వేలంను వాయిదా వేసినట్లు పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఈఓ మహేశ్వరయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కాంప్లెక్స్‌లోని 1-13 వరకు గల దుకాణాలకు శుక్రవారం వేలం నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే రోడ్డు విస్తరణ చర్యల నేపథ్యంలో స్థానికులు వేలంను వాయిదా వేయాలని ఎంఎల్ఏ పులివర్తి నానిని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఏ రెండు నెలల పాటు వేలంను వాయిదా వేయాలని అధికారులను ఆదేశించారు.

## హెల్మెట్లు ధరించండి.. సురక్షిత ప్రయాణం చేయండి!



**రేణిగుంట జనవరి 31 ప్రభాతవార్త :** ద్విచక్రాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయాలని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, అర్బన్ సిఐ శరత్‌చంద్ర సంయుక్తంగా అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు విద్యార్థులకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. వీడియో ప్రదర్శన ద్వారా రోడ్డు భద్రతపై అనేక విషయాలను వివరించారు. ముఖ్యంగా యువకులు తప్పనిసరిగా 18 సంవత్సరాలు దాటిన తర్వాత వాహనాలు నడపడానికి లైసెన్సులు తీసుకోవాలన్నారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదు అన్నారు. హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదు అన్నారు. యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాదముని రెడ్డి, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్‌రెడ్డి కళాశాల బోధనబోధనేతర ఇబ్బంది పాల్గొన్నారు. ఆర్ జి టి 2. విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అర్బన్ పోలీసులు.

## ఎస్పీడబ్ల్యూ విద్యార్థినులకు బెస్ట్ ఫర్మార్మెన్స్ అవార్డు



**తిరుపతి విద్య, జనవరి 31 ప్రభాతవార్త :** తిరుపతి పోలీస్ గ్రౌండ్ వేదికగా ఈనెల 26న జరిగిన గణతంత్ర దినోత్సవ ఎన్సీసీ కవాత్తులో ప్రతిభ చూపి కలెక్టర్ చేతులు మీదుగా బెస్ట్ ఫర్మార్మెన్స్ అవార్డును అందుకున్న శ్రీ పద్మావతి డిగ్రి కళాశాల విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ డబ్ల్యూ కళాశాలకు చెందిన ఎన్సీసీ విద్యార్థిలు పి. కావ్య, పి. సరస్వతి, ఎన్.సాయి గోపిక, ఎల్ కులదీపిక కవాత్తులో ప్రతిభ కనబరచి కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీటీవో సీహెచ్ సుహాసిని, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## సదర్వ ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ



**తిరుపతి విద్య, జనవరి 31 ప్రభాతవార్త :** శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఇంజనీరిర్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28వ తేది నుంచి రెండు రోజుల పాటు జరిగే సదర్వ ఈవెంట్-2025 పోస్టర్ వీసీ ప్రొఫెసర్ ఉమా వర్సిటీలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సదర్వ ఈవెంట్లో ప్రధానంగా విద్యార్థులకు పోస్టర్, పేపర్ ప్రెజెంటేషన్ ప్రాజెక్టు, ఎక్స్‌పోవర్క్ షాప్తో పాటు టెక్నికల్ గేమ్స్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్. రజిని, ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, అధ్యాపకులు బి. మాదవి, శ్రీనివాస పద్మజ, డాక్టర్ రామకృష్ణ స్టూడెంట్ కన్వీనర్ ఇందుశ్రీ, స్టూడెంట్ కో-కన్వీనర్ భాను ప్రశాంతి పాల్గొన్నారు. కాగా ఈ టెక్‌ఫెస్టిలో ఈసీఈ డిపార్ట్ముంట్ వారు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

## ట్రాన్స్ జెండర్స్ హక్కుల రక్షణపై అవగాహన

**తిరుపతి విద్య, జనవరి 31 ప్రభాతవార్త :** శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్ర, సర్వోదయ మహిళా సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీ హ్యూమెనిటీస్ బ్లాక్ సెమినార్ హాల్‌లో ట్రాన్స్ జెండర్స్ హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ ఆదినారాయణరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల దృక్పథంలో మార్పులు తీసుకుని రావడమే అవగాహన కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం డీన్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు ట్రాన్స్ జెండర్లకు శిక్షణ తరగతులను నిర్వహించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఆముదవల్లి డాక్టర్ నీరజ, డాక్టర్ జనార్థన్ రాజు, అధ్యాపకులు పెద్దసంఖ్యలో ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

## మంజూరు రూ.10 లక్షలు

– అరకొర పనులు – పత్తాలేని తుడా అధికారులు



**సత్యవేడు, జనవరి 31 ప్రభాతవార్త:** సత్యవేడు-ఊత్తుకోట రోడ్డులోని ఎన్‌టీఆర్ పార్కు పనులు అసంపూర్తిగా వదిలేశారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ఉపాధిహామీ పథకం కింద లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పూల చెట్లు, వివిధ మొక్కలు ఏర్పాటు చేసి ఆ పార్కును ప్రారంభించకుండానే చిట్టడివి నిర్లక్ష్యంగా వదిలేశారు. దాంతో స్థానికుల అభ్యర్థన మేరకు ఇక్కడ ఆహ్లాదకరమైన పార్కు, స్థానికులు వాకింగ్ చేసుకోవడానికి అనువైన ప్లాట్‌ఫారం నిర్మించాలని తుడా అధికారులను ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. తుడా అధికారులు పది లక్షలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా పార్కు నిర్మాణం పనులు చేపట్టారు. అధికారులు పార్కు పనులను అసంపూర్తిగా వదిలివేయడం చాలా బాధించే అంశంగా ఉందని స్థానికులు ఆవేదన.

## టీడీపీలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత

**వడమాలపేట, జనవరి 31 ప్రభాతవార్త:** ఆర్యవైశ్యులకు ఉమ్మడి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. వాసవీ కన్యకాపరమేవ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా నిర్వహించాల్సిందిగా ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వడమాలపేటలోని వాసవీ కన్యకాపరమేవ్వరి ఆలయంలోఎమ్మెల్యే శుక్రవారం అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజశెట్టిలు భానుప్రకాష్‌ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిస్తూ వాసవీ దేవి చిత్ర పటాన్ని బహుకరించారు. మండల స్థాయి అధికారులు ఎస్ఐ ధర్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయలునాయుడులను శాలువలు, మెమెంటోలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి:కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, జనవరి 31 ప్రభాతవార్త:** నగర పాలక సంస్థ పరిధిలోని గృహాల వద్ద, వాణిజ్య సముదాయాల్లోను ప్రతి రోజూ తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కమిషనర్ మౌర్య పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 33వ వార్డు స్కావెంజర్స్ కాలనీ, రైల్వే కాలని తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ దూది కుమారి, హెల్త్ ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వార్డులోని ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా తమ సిబ్బందికి అందించాలని అన్నారు. దుకాణాల వద్ద చెత్త బుట్టలను పరిశీలించారు. మురుగు కాలువలు మరమ్మత్తు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్కావెంజర్స్ కాలనీ వాసులకు కావాల్సిన అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డిఈ రాజు, ఎసిపి బాలాజీ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్య ఖుర్ ఆన్ పఠనంతోనే సన్మార్గం : హాఫీజే ఖుర్ ఆన్



**శ్రీకాళహస్తి, జనవరి 31 ప్రభాతవార్త :** ఇస్లాం మతం మంచిని నేర్పుతుందని ఆచరించుటకు రెండు మార్గలున్నాయని ఒకటి మహానీయులు జీవితాలు, మరొకటి దివ్యఖుర్‌ఆన్‌ను చదవటం అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియామస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత మాట్లాడుతూ నేడు యువత దారి తప్పి వ్యవహారిస్తున్నారన్నారు. మనం సన్మార్గంలో నడిచి స్వర్గస్తులు కావాలంటే మహానీయులు ఆచరించిన విధానాలను తు.చ.తప్పక ఆరచరించాలన్నారు. మరో మార్గం దివ్యఖుర్‌ఆన్ పఠనం, ఖుర్‌ఆన్‌ను ఆర్థం తెలుసుకొని పఠించాలన్నారు. సంసారంలో సుఖం లేదంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అల్లాహ్ తాను అందించిన దివ్యఖుర్ ఆన్‌లో స్పష్టంగా మానవుడు ఆచరించాల్సిన విధి విధానాలు పొందుపరచి వాటిని ఆచరించి మార్గదర్శకం కోసం మహమ్మద్ ప్రవక్తను పంపారన్నారు.

## శ్రీకాళహస్తిలో బిసి హాస్టల్ ప్రారంభం



**శ్రీకాళహస్తి రూరల్, జనవరి 31 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలోని పాత సంస్కృత పాఠశాల సమీపంలో శుక్రవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి బిసి హాస్టల్‌ను ప్రారంభించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోకానీ శ్రీకాళహస్తి మండలంలో బిసి హాస్టల్‌లేదు. ప్రస్తుతం పునఃప్రారంభించిన బిసి హాస్టల్ ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేటలో నిర్వహించే వారు. మూడేళ్ళుగా అక్కడ విద్యార్థుల సంఖ్యాబలం లేదని మూసివేసారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిసి సంక్షేమశాఖ అధికారులు ఈ సమస్యను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. బదిలి కార్యక్రమాలను కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. దాంతో మార్పుకు బిసి సంక్షేమశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ హాస్టల్‌ను పట్టణ నడిబొడ్డులోని సంస్కృత పాఠశాల వెనుక ఉన్న ఓ భవనంలో ఏర్పాటు చేసారు. దానిని శుక్రవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎఇఓ బాలయ్య, సంస్కృతపాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు బిజెపి నాయకురాలు కండ్రిగ ఉమ, రామకృష్ణయాదవ్, కృష్ణయాదవ్, కన్నలి మోహన్, కన్నలి ప్రతాప్, ఢిల్లిబాబు తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనది



**నింద్ర, జనవరి 31 ప్రభాతవార్త :** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని మండల విద్యాశాఖాధికారి వసుమతిదేవి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో యంపిపి పాఠశాలలో పని చేసిన బిఆర్ సుబ్రమణ్యం దంపతులను పదవీ విరమణ సందర్బంగా ఘనంగా సన్మానించినారు. ఈకార్యక్రంలో కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శ్రీధర్ రాజు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మలయాళస్వాముల వారి చిత్రపటాలకు పూజలు



**శ్రీకాళహస్తి, జనవరి 31 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని స్వర్ణముఖి తీరాన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శుక్రవారం ఆశ్రమ ఆవరణలో మలయాళస్వామిజీ చేరిన కుటీరంలో పూజలు హోమాలు నిర్వహించారు. ఆ రోజు మాఘమాసం పవిత్రమైన, ఆధ్మాత్మికతకు సంస్కృత విద్యను మహిళలకు బోధించుటకు మార్గదర్శకం చూపిన ఏర్పేడులోని సద్గురు మలయాళ స్వామి వారి ఆశ్రమం నుంచి విద్యాప్రకాశానందగిరి స్వామి ఇక్కడకు రాగా ఆయనగురువు మలయాళస్వామి ఇక్కడకు వచ్చి మొట్టమొదట అభయ కుటీరంలో పూజలు జరిపిన పవిత్రమైన రోజు అన్నారు. ఈ నేపథ్యంలో ఆశ్రమం ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నాటి మొదటి కుటీరం స్థానంలో శుక్రవారం సాధువులతో, వేదపండితులతో గణపతి హోమం, మహారుద్రహోమం, లక్ష్మీనారాయణ హోమం, నిర్వహించారు. ఆశ్రమంలోని ధ్యానమందిరంలోని స్వామి పాలరాతి విగ్రహానికిపూజలు జరిపారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామిచే పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా 18 అధ్యాయాల గీతాపారాయణం జరిపారు.

***న్యూజీలాండ్ నుంచి భక్తులు:*** శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమం వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందగిరి స్వామి గీతా పారాయాణలు దేశ విదేశీ భక్తులను ఆకట్టుకుంది. ఈనేపథ్యంలో శుక్రవారం కార్యక్రమాలకు న్యూజిలాండ్ నుంచి నోమి జార్జియా, పద్మావతి, తన్మయి, మునీంద్రలు హాజరై హోమాల్లో పాల్గొన్నారు. స్వామి పట్ల వారి భక్తిని ప్రదర్శించారు. వారికి స్వామి వారిచే రచించబడిన 'యోగవాసిష్టం' గ్రంధాన్ని ప్రసాదంగా విద్యాస్వరూపానందగిరి స్వామి అందించారు.

## డ్రైవర్, కండక్టర్‌ను సత్కరించిన యూనియన్



**శ్రీకాళహస్తి, జనవరి 31 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి ఎపియస్ఆర్‌టిసి డిపోలో పని చేస్తున్న ఓ డ్రైవర్, మరో కండక్టర్ ఉద్యోగ విరమణ చేసినసందర్భంగా శుక్రవారం యూనియన్ నాయకులు వారిని సత్కరించారు. శ్రీకాళహస్తి డిపోలో పని చేసిన కండక్టర్ ఆర్ ఎం నాయుడు, డ్రైవర్ జి.రఘ ఉద్యోగ విరమణ చేసారు. వారిని ఎపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్‌యూనియన్ సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా యూనియన్ గౌరవాధ్యక్షుడు మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరిని దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ నాయకులు, డిపో అధ్యక్షులు పురుషోత్తం ఆచారి, కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసకుమార్, శివప్రసాద్, కుప్పయ్య, రోశయ్య, మురళి, ఆశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్లంలో శివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**శ్రీకాళహస్తి రూరల్, జనవరి 31 ప్రభాతవార్త :** ఏర్పేడు మండలంలోని పరశురామేశ్వరాలయంలో మహాశివరాత్రికి విశేష సంఖ్యలో భక్తులు వస్తారని ఎలాంటి అవరోధాల్లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు పాలకులు అధికారిని సూచించారు. శుక్రవారం రేణిగుంట డివైయస్‌పి శ్రీనివాసరావు, ఏర్పేడు సిఐ జయచంద్ర, ఎస్ఐ శ్రీకాంతరెడ్డి ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి, ఛైర్మెన్ గిరినాయుడులు కలసి పార్కింగ్ సదుపాయాన్ని పరిశీలించారు. ఇటీవల తిరుపతి వైకుంఠ ఏకాదశి, కుంభమేళాలో జరిగిన సంఘటనలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయాన్ని పరిశీలించారు. ఇప్పటికే అక్కడ ఛైర్మెన్ గిరిబాబునాయుడు, ఇఓ రామచంద్రారెడ్డిలు వచ్చే వాహనాలను పార్కింగ్‌కు అనుకూలంగా గ్రౌండ్ తయారు చేస్తున్నారు. అంతేకాక ఆలయం చిన్నది కాబట్టి దర్శనానికి వచ్చే వారిని బయటనే అదుపు చేయాలని చర్చించారు. ఇందుకు ఒక వేళ ఎండ ఉన్నా తగిన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులు పాలకులను సూచించారు

## డ్రైవింగ్‌లో ఎమోషన్ వద్దు జాగ్రత్త అవసరం : ఎస్ఐ



**సత్యవేడు, జనవరి 31 ప్రభాతవార్త:** వాహనాలు నడిపేటప్పుడు ఎమోషన్ వీడి జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సత్యవేడు ఎస్ఐ రామస్వామి సూచించారు. ఇజల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు కొనసాగు తోంది. ఇందులో భాగంగానే శుక్రవారం మండల పరిధిలోని వెంకటరాజుల కండ్రిగ వద్ద రోడ్డు భద్రత, నియమాలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలనన్రు. పైగా రహదారి నియమాలు కేవలం సూచనలు కాదు లైఫ్‌సేవర్స్ అన్నారు. అందు వల్ల భద్రతను షార్ట్‌కట్ చేయకుండా సరైన మార్గాన్ని తీసుకోవాలన్నారు. అంతకు ముందు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వాహనదారులకు పోలీసు అధికారులు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసులు సురేష్, శ్రీధర్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## హత్యా స్థలాన్ని పరిశీలించిన డిఎస్పీ



కోట, జనవరి 31 ప్రభాతవార్త : కోట మండలం జరుగుమల్లి గ్రామంలో గురువారం కుమారి కోటయ్యను తమ్ముడు మస్తానయ్య హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం గూడూరు డిఎస్పీ గీతాకుమారి జరుగుమల్లి గ్రామానికి వెళ్లి హత్యా స్థలాన్ని పరిశీలించారు. హత్య చేయాల్సిన అవసరం ఏమిటనే కోణంలో ఆమె విచారణ జరిపారు. అనంతరం కోట ప్రభుత్వాసుపత్రికి చేరుకొని కోటయ్య మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి కోట పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఆమె వెంట వాకాడు సిఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

## ట్రస్ట్‌చే కుట్టు మిషన్లు, హాకీ కిట్లు పంపిణీ



గూడూరు, జనవరి 31 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ డాక్టర్ శ్రీలక్ష్మి, పిఎం రావు దంపతుల ఆర్థిక సహాయంతో కుట్టు మిషన్లు, హాకీ కిట్లు, హాకీ క్రీడాకారులకు ప్రతి నెల అందించే పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ ద్వారా గూడూరు పట్టణం పరిసర ప్రాంతాల్లో నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ శ్రీ లక్ష్మి, పిఎం రావు దంపతుల ఆర్థిక సహాయంతో నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, టిడిపి మునిగిరీష్, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ ంరెడ్డి, సనత్ రెడ్డి, ధనుంజయరెడ్డి, సుబ్రమణ్యం, పాదర్తి ప్రసాద్, బొమ్మిడి శ్రీనివాసులు, స్వర్ణ, రాజశేఖర్, దిలీప్, లయన్స్‌క్లబ్ సభ్యులు ఆర్‌వి రావు, సుబ్రమణ్యం, గురునాథం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని వాటర్ ప్లాంట్‌పై విచారణ



కోట, జనవరి 31 ప్రభాతవార్త : కోట మండలం తిన్నెలపూడి గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌పై శుక్రవారం ఎంపిడిఓ వేణు విచారణ జరిపారు. నీళ్లను శాంపిల్స్ తీసుకొని ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. ల్యాబ్ రిపోర్టు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. లైసెన్సు ఉందా, టెక్నీషియన్స్ ఎవరని ప్రశ్నించారు. వాటర్ ప్లాంట్‌లోని అన్ని గదులు, మిషన్లను పరిశీలించారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకుడికి పంచాయతీ కార్యదర్శి రియాజుద్దిన్ నోటీసులు అందజేశారు. వాటర్ ప్లాంట్‌కు పది రకాల అనుమతులు అవసరం కాగా, ఒక్క అనుమతి కూడా లేకుండా ప్లాంట్ నిర్వహించడం చట్టవిరుద్ధమని ఎంపిడిఓ చెప్పారు. ఆయన వెంట ఎఎన్ఎం శ్రీలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్‌లు ఉన్నారు.

## డ్రగ్స్ రహిత దిశగా ఆంధ్రప్రదేశ్ : టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్



గూడూరు, జనవరి 31 ప్రభాతవార్త : డ్రగ్స్ రహిత దిశగా ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎం. బాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రకాలు, వాటివల్ల మనిషిలో కలిగే వైపరీత్యాలు, అనారోగ్యా, జీవిత సమస్యలు గురించి వివరిస్తూ ప్రజలు ఈ డ్రగ్స్‌కి ఎలా బానిసలైపోతున్నారో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జెవి భాస్కర్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ వై. నీరజ ఈ డ్రగ్స్ గురించి విద్యార్థులకు మరికొన్ని విషయాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ఎఓ కొండారెడ్డి, ఎఓఎం అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల హృదయాల్లో నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి



కోట, జనవరి 31 ప్రభాతవార్త : ప్రజల హృదయాల్లో దివంగత నేత నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి చెరగని ముద్రవేసుకున్నారని పలువురు రాజకీయ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కోటలోని నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి 37వ వర్ధంతిని ఆయన తనయుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించారు. ముందుగా నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గోపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కోటమ్మ గుడిలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, చిల్లకూరు దశరధరామిరెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, కందల బాలకృష్ణపలగాటి భాస్కర్‌రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, జితేంద్రరెడ్డి, చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ప్రసాద్, నరమాల రమణయ్య, అల్లం రమణయ్యలు పాల్గొన్నారు.

## డా. బిఆర్ అంబేద్కర్‌కు నివాళులు



గూడూరు, జనవరి 31 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని ప్రధాన పోస్ట్ కార్యాలయం ఆవరణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి అరవ పార్వతయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కమిటీ సభ్యులుగా ఎంపికైన సందర్భంగా గూడూరు, కోట, వాకాడు, సూళ్లూరు పేట, నెల్లూరుకు చెందిన ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ నాయకులు ఆయనను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం డివిఎంసి మాజీ సభ్యులు దాసరి వెంకటేశ్వర్లు ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు మేజూరు మాధవ్ కేక్‌ను కట్ చేసి ఆయనకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు మదన్ మిశ్రా, పసల చిరంజీవి, గోను జయరామయ్య, దాసరికృష్ణ, వెంబేటి చంద్రయ్య, నాసిన భాస్కర్ గౌడ్, ఎల్బీ సుబ్బయ్య, మస్తాన్‌భాష, రావూరిసురేంద్ర, బాబయ్య, నాగరాజు, చెంచుబాబులు పాల్గొన్నారు.

## నెల్లిపూడిలో సివిల్ రైట్స్ డే



వాకాడు, జనవరి 31 ప్రభాతవార్త : వాకాడు మండలం నెల్లిపూడి గిరిజన కాలనీలో శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ పౌర హక్కు స్వేచ్ఛపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి దీప్తి, ఈవోపిఆర్డి ఉమామహేశ్వర రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ కుమార్, వీఆర్వో అరుణ కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ సుమాంజలి, వివిధ శాఖల సిబ్బంది, నాయకుడు బందెల వెంకటయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీహరికోటలో స్పేస్ సెంట్రల్ స్కూలు వార్షికోత్సవం



శ్రీహరికోట (తడ), జనవరి 31 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని స్పేస్ సెంట్రల్ స్కూలు 51వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్ కురుప్పు ఆడిటోరి యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా తిరుపతి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఎ.సయ్యద్ హమీద్, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.ముత్తు సెజియన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు స్కూలు అడ్వయిజరీ ఛైర్మన్‌తో పాటు ఇతర ప్రముఖులు బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

## చారిటబుల్ ట్రస్ట్‌చే తాజుద్దీన్‌కు ఘన సన్మానం



గూడూరు, జనవరి 31 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని దువ్వూరి రవణమ్మ కళాశాలలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్‌ను కలిసి శాలువాలతో సత్కరించి మెమొంటోను బహుకరించారు. తొలుత డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఏఈపి హనుమంతరావు మాట్లాడుతూ తాజుద్దీన్‌కి గతంలోను డివిజన్‌లో రెండుసార్లు అట్రాసిటీ సభ్యులుగా సేవలు చేశారని తెలిపారు. అలాగే తమ కాలేజీ నందు జరిగిన సైన్స్ ఫైయిర్‌లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు మెమోంటోలు, బహుమతులు అందించనిందుకు మాకు ఎంతో గర్వంగా ఉందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గాయత్రి తెలిపారు. అనంతరం డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ ఇటువంటి గొప్ప అవకాశాన్ని తమకు కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌కు, ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పి. శ్రీనివాసులు, కె. రవికుమార్, ఎస్‌కె సాజిద్ భాష, అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి ఆర్.గోవింద్ నాయక్, ప్రజా అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు డి.సురేంద్ర బాబు, డి. రాధాయ గురువు, ఎస్‌కె కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

## బండ్ల సుధాకర్ సేవలు మరువలేనిది



గూడూరు, జనవరి 31 ప్రభాతవార్త: ఉపాధ్యాయులు బండ్ల సుధాకర్ సేవలు మరువలేనిదని ప్రధానోపాధ్యాయులు బి.మదుకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాలిచర్లవారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బండ్ల సుధాకర్ పదవి విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణమ్మ, ప్రజేంద్ర రెడ్డి, మస్తానమ్మ, విజయలక్ష్మి, ఎస్ఎంసి చైర్మన్ షకీలా, మాధవయ్య, చంద్రశేఖర్, మంజుశ్రీ, సురేంద్ర, గ్రామస్తులు శ్రీనివాసులు, కామేశ్వరి, ఆదిలక్ష్మి, నాగభూషణ, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిసి కార్పొరేషన్‌లో రుణాలు మంజూరు

తడ, జనవరి 31 ప్రభాతవార్త : తడ మండలంలో బిసి కార్పొరేషన్ విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఎంపిడిఓ విజయకుమార్ తెలిపారు. జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆయన ప్రకటన చేస్తూ 63 మంది వివిధ కేటగిరిల లబ్ధిదారులకు ఒక కోటి 38 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేసిందని, లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

## రుణాల కోసం దరఖాస్తులు చేసుకోండి

బాలాయపల్లి, జనవరి 31 ప్రభాతవార్త : బీసీ కార్పొరేషన్ రుణాల కోసం సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ డిజే వినీల్ కుమార్ తెలిపారు. అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్‌తో లింక్ అయిన ఫోన్ నెంబరు ఇవ్వాలని తెలిపారు. ఫిబ్రవరి నెల ఏడో తేది లోపల సచివాలయాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

## ఆరోగ్యం కోసం వ్యాయామం అవసరం : సిఐ



వెంకటగిరి, జనవరి 31 ప్రభాతవార్త : ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలని సిఐ ఏవి రమణ తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు చెందిన ఎస్ఐలు సిబ్బందికి రోల్ కాల్ నిర్వహించారు. నేటి ఆహారం వల్ల అందరూ అనారోగ్యాల గురవుతున్నట్లు తెలిపారు. నడక తదితర వ్యాయామాలు చేయాలని సూచించారు.

## బీసీల అభివృద్ధికి రూ. 896 కోట్లు : గెరిటి చెంచయ్య

బాలాయపల్లి, జనవరి 31 ప్రభాతవార్త : బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 896 కోట్ల నిధులను విడుదల చేయడం గర్వించదగిన విషయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమన్వయంతో బిజేపి రాష్ట్రాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో, బీసీ మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో ఈ నిదులు విడుదల కావడం బిసి వర్గాల భవిష్యత్తుకు బలమైన పునాది పడిందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వైసిపి పాలనలో బీసీలకు నిధుల కొరత ఏర్పడి, అనేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. భవిష్యత్తులో మరిన్ని బిసి సంక్షేమ పథకాలు రాబోతున్నాయనే విషయాన్ని తెలిపారు.

## భూమన హయాంలో అన్ని దౌర్జన్యాలే : ఆర్.సి మునికృష్ణ




తిరుపతి హెల్త్, జనవరి 31 ప్రభాత వార్త : తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి హయంలో తిరుపతి, చుట్టు ప్రక్కల జరిగిన ఎన్నికలు అన్నీ దౌర్జన్యాలతో జరిగాయని టీడీపీ నేత ఆర్.సి మునికృష్ణ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమన కరుణాకర్‌రెడ్డి రాజకీయాలను తిరుపతి ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఏనాడు కరుణాకర్‌రెడ్డి కార్పొరేటర్లకు తిరుపతి ప్రజలకు విలువ ఇవ్వలేదన్నారు. తన కుమారుడిని ఓడించడానికి తిరుపతి ప్రజలు క్యూలైన్‌లో వేచి ఉండి ఓట్లు వేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ హుందాతో కూడిన రాజకీయాలు చేస్తుందన్నారు. అలాగే కూటమిలో ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, నాగప్రతాప్, ముని పాల్గొన్నారు.

## బిసిల సంక్షేమం కోసం రూ.896 కోట్లు మంజూరు

### - చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన బిసి సంక్షేమ సంఘం



చిత్తూరురూరల్, జనవరి 31 ప్రభాతవార్త: రాష్ట్రంలో బిసిల సంక్షేమం కోసం బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడితో కూడిన రూ.896 కోట్ల బ్యాంకు రుణాలను మంజూరుచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్షిణాది రాష్ట్రాల బిసి సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జి షణ్ముగం కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం బిసి వర్గాలను అన్ని రంగాల్లో అణగతొక్కి అభివృద్ధికి దూరంగా వుంచగా, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తెలుగుదేశం ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా రూ.896 కోట్లు నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ఈబిసిలకు యూనిట్ కాస్ట్‌లో సబ్సిడి 50శాతం ఇచ్చి వెనుకబడిన వర్గాలకు 37శాతం నిర్ణయించడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. బిసి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్, క్రిష్ణయ్య ఆద్వర్యంలో చేపడుతున్న ఫిబ్రవరి 6,7తేదిలలో హలో బిసి ఛలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని కుల సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం రజక సంఘాల సమైక్య జిల్లా అధ్యక్షుడిగా పూతలపట్టు నియోజకవర్గంకు చెందిన ఎన్.మోహన్, ప్రధాన కార్యదర్శిగా గంగాధరనెల్లూరు నియోజకవర్గంకు చెందిన జె. నవీన్‌కుమార్‌లకు నియామక పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంఘ అధ్యక్షుడు రవి, జిల్లా నాయి బ్రాహ్మణసంఘ అధ్యక్షులు వెంకటేష్, జిల్లా మేదర సంఘ అధ్యక్షుడు రమేష్, వన్నియకుల క్షత్రియ సంఘ నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేను సమగ్రంగా చేపట్టాలి : ఆర్డీవో



తొట్టంబేడు, జనవరి 31 ప్రభాతవార్త : గ్రామాల్లో రీసర్వేను సమగ్రంగా చేపట్టాలని ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, ఎడి అరుణ్‌కుమార్, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రాంప్రసాద్, డిఐ రాఘవయ్యలు తెలిపారు. శుక్రవారం బోనుపల్లిలో జరిగిన రీసర్వే గ్రామసభకు గ్రామస్తులతో పాటు అధికారులు హాజరయ్యారు. ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో భూవివాదాలు ఉండకూదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రీసర్వేను ప్రవేశపెట్టిందని దీంతో ఎవరెవరి భూములు హద్దులు, ఆన్‌లైన్‌లో ఉన్నాయా?లేవా అని పరిశీలించి వారికి కొత్త పాసు పుస్తకాలు అందిస్తామన్నారు. డిఐ రాఘవయ్య మాట్లాడుతూ బోనుపల్లి రెవెన్యూలో 1554 ఎకరాలు భూములు ఉన్నాయని ఇందులో 455 ఎకరాలు జాయింట్ భూములు ఉన్నాయని వీటిని అన్నదమ్ముళ్ళు భాగపరిష్కారాల ద్వారా చేసేందుకు మూడు ప్రత్యేక టీంలను నియమించామన్నారు. ఇక కొన్నలి గ్రామంలో ఇప్పటికే రెండు బృందాల ద్వారా రీసర్వే జరుగుతోందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూధనరావు, డిప్యూటీ తహశీల్దార్ జగన్‌మోహన్, సర్వేయర్ హరనాధ్, సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

## వకుళమాత ఆలయ ప్రహారి గోడ ధ్వంసం



తిరుపతిరూరల్, జనవరి31 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత ఆలయ ప్రహారి గోడను ధ్వసం చేసినట్లు పాతకాల్వ గ్రామస్తులు తెలిపారు. ఇటీవల కాలంలో పాతకాల్వ గ్రామంలో పునఃనిర్మితమైన వకుళమాత ఆలయం ప్రాచుర్యం లోకి వస్తున్న విషయం తెల్సిందే. శ్రీవకుళమాత ఆలయంలో టిటిడి పర్యవేక్షణలో అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. ఆలయం చుట్టూ టిటిడి ప్రహారి గోడ నిర్మించింది. అయితే ఈమధ్య కాలంలో కొందరు వ్యక్తులు ప్రహరీ గోడను ధ్వంసం చేసారని స్థానికులు తెలిపారు. టిటిడి గోడను ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మాజీ మంత్రి అమరనాథరెడ్డి



గంగవరం, జనవరి 31, ప్రభాతవార్త : రాష్ట్రంలో మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని రైతు భరోసా కేంద్రం వద్ద స్థానిక సర్పంచ్ చంద్రమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారకరామారావు మహిళల అభ్యున్నతకి ఆనాడే బీజం వేసారని, దేశంలోనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. మహిళలకు పురుషులతోపాటు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహనీయుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావేనని ఆయన కొనియాడారు. తెలుగుదేశం పార్టీ మహిళల కొరకు దీపంకనెక్షన్‌లు, కుటీరపరిశ్రమలు ఏర్పాటు చేసి పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేసిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల కోసం ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, తల్లికివందనం, దీపం2, మహాశక్తి, ప్రతీస్రీకి నెలకు రూ.1500ల నగదు, వంటి పథకాల అమలుకు కసరత్తు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 127 గ్రూపులలోని మహిళలకు రూ.20.37 కోట్ల చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నూతనకాల్వ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధనకార్యదర్శి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటి చైర్మన్ శ్రీరాములురెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి చిట్టిబాబు, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు జయమ్మచిట్టిబాబు, పంచాయితీ ప్రధానకార్యదర్శి బాలాజి, నాయకులు ప్రసాద్‌నాయుడు, స్వాతి, కిరణ్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి, హరి, కొత్తపల్లిరాము, తహశీల్దారు మాధవరాజు, ఎంపీడీఓ సురేష్‌బాబు, వెలుగు ఏపీ హరినాథ్, వెలుగు సీసీలు, సంఘమిత్రాలు, అధిక సంఖ్యలో గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

## మహా కుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా



పుత్తూరురూరల్, జనవరి 31 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపాలిటీ 21వ వార్డు చెర్లోపల్లిలో శ్రీశ్రీశ్రీ కామాక్షి సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామివారి నూతన ఆలయ అష్టబంధన విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి రోజా శుక్రవారం పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులు మాజీ మంత్రి రోజాకి ఘన స్వాగతం పలికారు. స్వామివారికి విశేషంగా జరిగిన మహా కుంభాభిషేక మహోత్స వంలో భాగంగా ప్రత్యేక గణపతిపూజ కలశ ప్రతిష్ట, వేదపారాయణం కలశారాధన, నవగ్రహ పూజ మండప ఆరాధన, వాస్తు క్షేత్ర పాలకాది హోమాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం నైవేద్యం మంగళ హారతి విశేషంగా నిర్వహించారు. ఆలయంలో అర్చన, హారతి తీర్థ ప్రసాదాలతో వేద మంత్రాలతో పూజారులు మాజీ మంత్రిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయం పోలీసు వారికి... యూనిఫామ్ తప్పనిసరి చేయండి



పాకాల, జనవరి 31 ప్రభాతవార్త : పాకాల మండలం పరిధిలో వున్న గ్రామ సచివాలయాలలో పనిచేసే మహిళా పోలీస్ వారు విధులకు ఖాకీ యూనిఫామ్‌లో హాజరు తప్పనిసరి చేయాలి, మండల సర్వసభ్య సమావేశంలో సాక్షాత్తూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాకాల మండలంలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకంపై ఎక్సైజ్ శాఖ పోలీసులు సరిగ్గా స్పందించకపోవటం లేదు అని తీవ్ర ఆగ్రహం ఒకింత అసహనం వ్యక్తం చేసారు. పాకాల మండలంలోని గ్రామ వార్డు సచివాలయ మహిళా పోలీసులు నిత్యం గ్రామాలలో పర్యటించి శివారు ప్రాంతాలలో అమ్ముతున్న గంజాయి, పల్లెల్లో ప్రజలకు అందుబాటులో ప్రస్తుతం వున్న బెల్టు షాపులు, నాటు సారాయి, పక్క రాష్ట్రాల నుంచి తెచ్చి అమ్మే లిక్కర్ అమ్మకాలపై ఎప్పటికప్పుడు వాకబు చేసి అక్రమార్కుల పై కేసులు నమోదు చేసి గ్రామంలోని ఆడవారికి అండగా నిలవాలని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం మండలంలో గ్రామ, వార్డు సచివాలయంలో వీరు మహిళా ఎపోలీసులు అన్న విషయం కూడా స్థానిక గ్రామంలోని చాలా మంది పల్లె ప్రజలకు తెలియదు అంటే అతిశయోక్తి కాదు. సచివాలయం వ్యవస్థలోని మహిళా పోలీస్ కానిస్టేబుల్లను ఎక్సైజ్ శాఖ పరిధిలోకి తీసుకొచ్చి గ్రామ పంచాయితీ మహిళా ఎపోలీసు వ్యవస్థను మరింత లోతుగా మరింత పటిష్టంగా వీరి దగ్గర ఉన్నతాధికారులు పనిచేయించాలని, ఈ సందర్భంగా మండలంలోని ప్రజలు, బిజేపి రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి వెంకటాద్రి నాయుడు, కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## అర్హులందరికీ..ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### -మాజీ మంత్రి,ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



గంగవరం, జనవరి 31, ప్రభాతవార్త : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కార్యాచరణ అమలు చేయాలని మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిపి నీరుగట్టి వెంకటరమణ అధ్యక్షతన మండలంలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా అధికారులు ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్ళాలన్నారు. గడచిన ఆరు నెలల పురోగతిపై ఆయన సమీక్షంచారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అధికారపార్టీ ముఖ్యనేతలతో సమన్వయం చేసుకుని మండలాభివృద్ధికి కృషిచేయాలన్నారు. ప్రధానంగా రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలోఉంచుకొని ఏ గ్రామంలోకూడా త్రాగునీరు సమస్య తలెత్తకుండా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అలాగే రెవెన్యూ సమస్యలపై, ఉపాధిపనులు, సబ్సిడీ పథకాలు, గతంలో పనులు చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలు, తదితర అంశాలపై క్షుణ్ణంగా అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నూతనకాల్వ విష్ణువర్దన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధనకార్యదర్శి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటి చైర్మన్ శ్రీరాములురెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి చిట్టిబాబు, పంచాయితీ ప్రధానకార్యదర్శి బాలాజి, ప్రసాద్‌నాయుడు, స్వాతి, కిరణ్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి, హరి, కొత్తపల్లిరాము, తహశీల్దారు మాధవరాజు, ఎంపీడీఓ సురేష్‌బాబు, వెలుగు ఏపీ హరినాథ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫార్మకో విజిలెన్స్ మరియు రిపోర్టింగ్ ఆఫ్ అడ్వర్స్‌డ్రగ్స్ రియాక్షన్ అనే అంశంపై విజయవంతంగా నిర్వహించారు. - ప్రభాతవార్త, తిరుపతి